క్లుప్తంగా

బార్ అసోసియేషన్‌లో దంతవైద్య శిబిరం



నరసరావుపేట టౌన్: తేజశ్రీ డెంటల్ వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాద సంఘ కార్యాలయంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల, డాక్టర్ సుజాత, డాక్టర్ హిమజాలు పాల్గొని ఆధునిక దంత వైద్యవిధానాల గురించి వివరించారు. అనంతరం న్యాయవాదులకు దంతసేవలు అందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. సుబ్బారావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



వినుకొండ: పట్టణంలోని లాయర్స్‌స్ట్రీట్‌లో ఎస్ ఆర్ కలర్ ల్యాబ్‌లో 186వ ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటో‌గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేసనపల్లి సుబ్బారావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఫొటోగ్రాఫర్లను ఏకం చేయడానికి మరింతమందిని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఆగస్టు 19న జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ శ్రీకాంత్, ఉపాధ్యక్షులు యార్లగడ్డ బుజ్జి, శ్యామ్, శ్రీనివాస్, బ్రహ్మం, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు రద్దు అయిన వారు అప్పీలు చేసుకోండి

చిలకలూరిపేట: దివ్యాంగుల పెన్షన్లకు సంబంధించి అనర్హులుగా ప్రకటించబడిన వారు, తాము అర్హులని భావించినట్లయితే సంబంధిత పత్రాలతో, సంబంధిత సచివాలయంలో అప్పీలు కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు తెలిపారు. పెన్షన్ తీసుకుంటూ అనర్హులైన లేదా పెన్షన్ రకం మార్పుతో నోటీసులు అందుకున్న పెన్షన్ దారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత సచివాలయంలో అప్పీలు కోసం అర్జీ, ఆధార్‌కార్డు జిరాక్స్, పెన్షన్ రద్దు లేదా పెన్షన్ మార్పు నోటీసు, పాత సదరమ్ సర్టిఫికేట్, కొత్త సదరమ్ సర్టిఫికేట్ (పెన్షన్ రకంలో మార్పు జరిగితే) సమర్పించాలన్నారు. అనర్హులుగా నోటీసులు పొందిన 30 రోజుల లోపు సంబంధిత సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ ద్వారా అప్పీలు చేసుకోవాలన్నారు.

22న ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం

వినుకొండ: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని ప్రత్యేక అవసరాల పిల్లల కోసం సమగ్ర శిక్షా సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలోని ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని ఈ నెల 22వ తేదీ స్థానిక జీవాలయంలో నిర్వహించనున్నట్లు ఎంఈవో జఫ్రుల్లా తెలిపారు. శిబిరానికి 18 సంవత్సరాల లోపు దివ్యాంగులు హాజరుకావాలని, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోల -2, సదరన్ సర్టిఫికెట్, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్‌లను తీసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9441691685 నంబరును సంప్రదించాలన్నారు.

సంచార జాతుల సదస్సును విజయవంతం చేయాలి

చిలకలూరిపేట: సంచారజాతుల సదస్సుకు సంబంధిత వర్గాల ప్రజలు భారీగా తరలిరావాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిటీషర్ల పాలనలో అనేక రకాలుగా సమస్యలను సంచార జాతుల ప్రజలు అనుభవించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళుతూ స్వతంత్ర్య పోరాట స్ఫూర్తి ప్రజలకు వివరించే వారని వెల్లడించారు. అలాంటి సంచార జాతుల పరిస్థితి నేటికి కూడా దైన్యంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 31వ తేదీన సంచార జాతుల దినోత్సవం ఉన్నందున సంబంధిత జాతుల్లో చైతన్యం నింపేందుకు బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 30 తేదీన విజయవాడలో స్ఫూర్తి అనే సంచార జాతుల సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఓబీసీ నాయకులు అన్నపరెడ్డి లక్ష్మణ్, కుప్పం కల్యాణ దుర్గారావు, గుమ్మా బాలకృష్ణ, ఊటికొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సూర్య ఘర్ యోజనలో రాయితీ

బొల్లాపల్లి: సోలార్ విద్యుత్ ఉత్పత్తికి బ్యాంక్ రుణంతోపాటు రాయితీ వర్తిస్తుందని మండల కోఆర్డినేటర్ డి.బిక్షాలు తెలిపారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంలో భాగంగా రుణ సౌకర్యం రాయితీ పొందవచ్చు అన్నారు సోలార్ ద్వారా 1 కిలో వాట్ విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడానికి రూ 1.50 లక్షల ఖర్చు అవుతుందని దీనిలో రూ.30 వేల వరకు రాయితీ పొందవచ్చు అని తెలిపారు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనలో ప్రతి ఒక్క లబ్ధిదారుడు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఆధార్, పాన్ కార్డు, ఇంటి పన్ను, కరెంట్ బిల్లు, బ్యాంక్ ఖాతా జిరాక్స్, మొబైల్ నెంబర్‌తో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు వివరాలకు 9666553414 ఫోన్ నెంబర్ సంప్రదించాలని తెలిపారు.

పాపం.. దివ్యాంగులు!!

అర్హత ఉన్నా పింఛన్లకు దూరం కానున్న వైనం

- నోటీసులు జారీ చేసిన అధికారులు
- పోషించే వారు లేక దీన స్థితిలో మానసిక దివ్యాంగులు
- పింఛనే ఆధారమంటూ బంధువుల ఆవేదన



పక్షవాతంతో మంచం పట్టిన పక్కనే ఆదిత్య



అద్దంకి అఖిల, మేళ్ల వాగు సచివాలయం

బొల్లాపల్లి: మానసిక, అంగవైకల్యంతో బాధపడుతున్న లబ్ధిదారులకు పింఛను మంజూరు విషయమై అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. వీరిలో అర్హత కలిగిన లబ్ధిదారులకు సైతం వైద్యులు ఇతర అధికారులు సరైన నిర్ధారణ పరీక్షలు చేయకుండా నోటీసులు జారీ చేయడంతో లబ్ధిదారులు బంధువులు లబోదిబోమంటున్నారు. ఉదాహరణకు మండలంలోని వెంకటరెడ్డి పురం తండాకు చెందిన మానసిక వైకల్యం కలిగిన బందారు ఆదిత్య వయసు 17 సంవత్సరాలు రెండేళ్ల వయస్సులో తల్లిదండ్రులు మృతి చెందారు. నాయనమ్మ, తాతయ్యల వద్ద పెరిగాడు. ఇప్పటికీ మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో నిత్యం కాపలా ఉండాల్సి వస్తుందని లబ్ధిదారుని సమీప బంధువులు తెలిపారు. తాతయ్య మృతిచెందాడు. నాయనమ్మ ఉలగమ్మ పక్షవాతంతో మంచం పట్టింది. ప్రస్తుతం సమీప బంధువు ఒకరు అలనాపాలన చూస్తోంది. మేళ్ల వాగు సచివాలయానికి చెందిన అద్దంకి అఖిల తండ్రి లేడు. మానసిక వైకల్యం, తోడు లేనిదే బయటికి వెళ్లలేని పరిస్థితి. తల్లి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. వీరికి పింఛనే జీవనాధారం. ప్రతినెలా పింఛన్ అందితేనే కుటుంబం గడిచేది. రెడ్డిపాలెం గ్రామానికి చెందిన బి.శాంతి మేరీ వినికిడి లోపంతో గత కొన్నేళ్లుగా పెన్షన్ పొందుతోంది. అయితే ఇటీవల మండలంలోని పింఛన్ తొలగింపులో వీరి పేర్లు ఉన్నాయని నోటీసులు జారీ చేశారని లబ్ధిదారులకు చెందిన కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేదరికంతోపాటు కూలి డబ్బులతో కుటుంబ పోషణ జరుగుతోందని, ఇప్పుడు పెన్షన్ తొలగిస్తే ఏం చేయాలో అర్థం కావడం లేదని వారంతా ఆవేదన చెందుతున్నారు. ఇలా మండలంలో మానసిక, అంగవైకల్యం ఉన్నవారికి 153 మంది లబ్ధిదారులకు షెర్ప్ ఆధ్వర్యంలో మండల పరిషత్ సచివాలయ సిబ్బంది ద్వారా నోటీసులు జారీ అయ్యాయి. సెప్టెంబర్ నెల నుంచి పెన్షన్ ఇవ్వరని లబ్ధిదారులు వాపోతున్నారు. పింఛన్ల తొలగింపు సక్రమంగా లేదని అర్హులైన వారు పేర్లు జాబితాలో ఉన్నాయని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. మానసిక, శారీరక వైకల్యం తదితర లబ్ధిదారులు, పింఛన్‌పై ఆధారపడి జీవించే కుటుంబాలు ఎన్నో ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు.

వైద్య పరీక్షలకు పంపిస్తాం

మండలంలో 153 మందికి మానసిక, శారీరక దివ్యాంగులకు చెందిన లబ్ధిదారులకు షేర్ప్ ద్వారా అందిన నోటీసులను జారీ చేశాం. వీరిలో అర్హత ఉంటే దరఖాస్తు చేసుకుంటే షేర్ప్ ద్వారా తిరిగి వైద్య పరీక్షలకు పంపిస్తాం. ఆ వైద్య పరీక్షల్లో జారీ చేసే ధ్రువీకరణ పత్రాన్ని పర్సంటేజ్‌తో పెన్షన్ ఇవ్వటం జరుగుతుంది.

–పి.సీతారామయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక చైర్మన్, విశ్రాంతి జిల్లా న్యాయమూర్తి ఎన్ విక్టర్ ఇమానియేలు



సమస్యలు తెలుసుకుంటున్న విక్టర్ ఇమానియేలు, అధికారులు

చిలకలూరిపేట: విద్యుత్ వినియోగదారులకు సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత విద్యుత్ అధికారులు, సిబ్బందిపై ఉందని విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక చైర్మన్, విశ్రాంతి జిల్లా న్యాయమూర్తి ఎస్.విక్టర్ ఇమానియేలు చెప్పారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని సింగు ఫంక్షన్ హాలులో విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు సమస్యలు అధికారుల దృష్టికి తెచ్చిన వెంటనే స్పందించి చర్యలు చేపడితే సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. వినియోగదారుల సంతృప్తి ఎంతో ముఖ్యమని వెల్లడించారు. ఈ సదస్సులో చిలకలూరిపేట పట్టణానికి సంబంధించి ఏడు సమస్యలు, చిలకలూరిపేట మండలానికి సంబంధించి రెండు సమస్యలు, గణపవరం సెక్షన్‌లో ఒక సమస్య, జోకిపత్రుకు సంబంధించి ఒక సమస్య, వట్టి చెరుకూరుకు సంబంధించి ఒక సమస్య ఫోరం దృష్టికి వచ్చాయి.

మొత్తం 12 సమస్యలకు సంబంధించి మూడు సమస్యలు వెంటనే పరిష్కారం కాగా, మిగిలిన తొమ్మిది దరఖాస్తులను ఏడు రోజుల లోపు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ప్రజల అనుమతి తీసుకోవాలి

కార్యక్రమంలో పాల్గొన్న కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షుడు మురికిపూడి ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించేటప్పుడు ఇళ్ల యజమానుల అనుమతి తీసుకోవాలని విశ్రాంత న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా గుర్రాల చావడి, నెహ్రూ నగర్ ప్రాంతాల మధ్య లోవోల్టేజి సమస్య ఉందని వెల్లడించారు. విద్యుత్ అత్యవసర కాల్స్‌కు సంబంధించి అధికారులు ఎవరూ స్పందించటం లేదని ఫిర్యాదు చేశారు. తగు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. సీఆర్‌డీపీ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎం.శ్రీనివాసరావు, సాంకేతిక సభ్యుడు ఎస్.శ్రీనివాస్, ఆర్థిక సభ్యుడు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర్య సభ్యురాలు ఎ.సునీత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.ఏడుకొండలు, డీఈఈ ఆర్.అశోక్‌కుమార్, తొమ్మిది మంది ఏఈఈలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

యడ్లపాడు వద్ద ఘటన



ప్రమాదం సంఘటన స్థలిలో విడిచిన ప్రమాదానికి కారణమైన స్కూటీ

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు సెంట్రింగ్ సామాన్ల లోడుతో వెళ్తున్న ఫోర్‌వీల్ ఆటో యడ్లపాడు ఎర్రకొండ సమీపంలో ఆగిపోయింది. దీంతో ఆటోలోని ముగ్గురు దిగి ముందుకు తోస్తున్న క్రమంలో అదేమార్గంలో వేగంగా దూసుకువచ్చిన స్కూటీ అదుపుతప్పి వారిలో ఒకరిని ఢీకొంది. దీంతో సదరు వ్యక్తి రోడ్డుపై పడి తలతో పాటు పలుచోట్ల కనిపించని గాయాలయ్యాయి. స్కూటీ నడిపే వ్యక్తి వాహనాన్ని వదిలి పరారయ్యాడు. తీవ్రంగా గాయలైన సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన విన్నకోట వెంకట మోహనరావు (52)ను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్సల అనంతరం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో యడ్లపాడు ఎస్ఐ టి శివరామకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో చోరీ

సత్తెనపల్లి: వేణుగోపాలస్వామి ఆలయంలో చోరీ జరిగిన ఘటన పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో సోమవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో గల రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలోకి గుర్తు తెలియని దుండగులు కల్యాణ మండపం గుండా గోడ దూకి లోపలికి ప్రవేశించారు. ఆలయంలోని సీసీ ఫుటేజ్‌కు సంబంధించిన వైర్లు కట్ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న కానుకల హుండీ పగలగొట్టి కానుకలను అపహరించుకుపోయారు. సుమారు రూ.15 వేలకు పైనే నగదు ఉండే అవకాశం ఉన్నట్లు అంచనా. దేవదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సరిమెళ్ళ కోటిరెడ్డి పట్టణ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆలయాన్ని సందర్శించారు. క్లూ స్ టీం, వేలిముద్రల నిపుణులు ఆలయానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోలీసు లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



వ్యర్థాలతో ప్రమాదమే!

అధికారుల నిర్లక్ష్యం ఆ ప్రాంత వాసులకు శాపంగా మారింది. పగులగొట్టిన చప్టా దిమ్మెలను తొలగించక పోవటంతో రోడ్డుకు అడ్డుగా మారి ప్రమాదాలకు గురిచేస్తుంది. దీంతో పాటు రాకపోకలకు అంతరాయం కలుగుతొంది. వివరాల్లోకెళ్లితే.. బరంపేట విద్యుత్ కార్యాలయం నుంచి బైపాస్‌కు వెళే దారిలో మురుగునీరు ప్రవహించే చప్టాను పగులగొట్టి ఆ స్థానంలో కల్వర్ట్‌ను నూతనంగా నిర్మించారు. చప్టాతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏర్పాటు చేసిన పిల్లర్ దిమ్మెను పగులగొట్టి వాటి దిమ్మెలను రోడ్డుపై పడవేశారు. రోజులు గడుస్తున్నా తొలగించక పోవటంతో తరుచూ ఆ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు ఆదమరిచి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొని గాయాలపాలవుతున్నారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న వాటిని తొలగించి సజావుగా రాకపోకలు సాగే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

–నరసరావుపేట టౌన్

గ్రీవెన్స్‌లో దరఖాస్తుకు నేడే ఆఖరి రోజు



రొంపిచర్ల: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీతో గడువు ముగుస్తుందని ఏవో శివలలిత అన్నారు. మండలంలోని సంతగుడిపాడు, కర్లకుంట గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత సాధించని వారు తమ సమస్యను గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే పంటల బీమా పథకాన్ని రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరినారుమళ్ల సాగులో రైతులు అవలంభించాల్సిన యాజమాన్య పద్ధతులు, విత్తనశుద్ధి తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఏఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

బంగారు గాజుల చోరీపై కేసు నమోదు

నాదెండ్ల: బంగారు ఆభరణాల చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జి పుల్లారావు తెలిపిన వివరాల మేరకు యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన ఘంటా మల్లేశ్వరి ఈ ఏడాది జూన్ 26న చిలకలూరిపేటలో ఆరు సవర్ల నాలుగు బంగారు గాజులు చేయించుకుని తన బ్యాగులో పెట్టుకుని ఆటోలో బయలుదేరింది. ఆటోలో ఆమెతో పాటూ మరో ముగ్గురు ప్రయాణికులు ఎక్కారు. గణపవరం స్పన్‌పైప్స్ కంపెనీ వద్దకు రాగానే ముగ్గురు ఆటో దిగారు. తరువాతి సెంటర్‌లో ఆటో ఆగిన సమయంలో తన బ్యాగును చూసుకోగా కత్తిరించి నాలుగు బంగారు గాజులు చోరీకి గురైనట్లు గుర్తించింది. దీంతో బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వర్షాల నేపథ్యంలో సస్యరక్షణ చేపట్టాలి



నాదెండ్ల: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పొలంలో ఉన్న నిల్వ నీటిని రైతులు బయటకు వెళ్ళబెట్టి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి ఎ.శ్రీలక్ష్మీ చెప్పారు. సంకురాత్రిపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో ఈక్రాప్ నమోదు కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ప్రతి రైతు తాము వేసిన పంటలను ఈక్రాప్ చేయించుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం వర్తించని రైతులు తిరిగి రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరావు, వీఏఏ ధనలక్ష్మి, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సమాజాభ్యున్నతికి దోహదపడాలి

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



నాదెండ్ల చర్చిలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మర్రి

నాదెండ్ల: నీ వలె నీ తోటి వారిని ప్రేమించు అన్న యేసు క్రీస్తు మాటలను ప్రతి ఒక్కరూ ఆచరించి సమాజాభ్యున్నతికి దోహదపడాలని శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల చైతన్యనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఎపిఫానియా లూథరన్ దేవాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో చర్చి నిర్మాణం జరగ్గా, ఇటీవల ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. సుమారు 200 కుటుంబాల వారు అందించిన ఆర్థిక సాయంతో చర్చి నిర్మాణం పూర్తి చేసినట్లు ఫాదర్ బి.మోహనరావు తెలిపారు. కృషి, పట్టుదలతో కొన్ని తరాల పాటూ గుర్తిండిపోయేలా చర్చి నిర్మాణం చేశారంటూ స్థానిక పెద్దలను ఆయన అభినందించారు.

పెట్టుబడి సాయం కోసం కౌలు రైతుల పోరాటం

25న నరసరావుపేటలో జరిగే ధర్నాకు పిలుపు



రైతులు, కౌలు రైతులతో మాట్లాడుతున్న నాయకులు

యడ్లపాడు: కౌలు రైతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్ని నెలవేర్చాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన సోమవారం జగ్గాపురం, జాలాది, సందెపూడి, తుర్లపాడు, కారుచోల, వంకాయలపాడు, ఉన్నవి, యడ్లపాడు, మైదవోలు, లింగారావుపాలెం, సొలస తదితర గ్రామాల్లో ఈ ప్రచార యాత్ర నిర్వహించారు. రైతులను ఈ నెల 25న నరసరావుపేట కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం కింద భూమి లేని రైతులకు ఒకే విడతలో రూ.20 వేల పెట్టుబడి సాయం అందించి.. సాగు హక్కు పత్రాలు జారీ చేయాలన్నారు. రుణమేళాలు నిర్వహించి బ్యాంకుల ద్వారా రూ.2 లక్షల వరకు వడ్డీలేని పంటరుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కౌలు రైతుల పేర్లు ఈ–క్రాప్‌లో నమోదు చేసి ఉచిత పంటల బీమాను అమలు చేయాలన్నారు. కౌలు కార్డు దరఖాస్తు ఫారాలు గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంచి ప్రోత్సహించాలని కోరారు. కౌలు రైతు సంఘం నాయకులు ఎస్.కాళిదాసు మాట్లాడుతూ ఢిల్లీ రైతుల ఉద్యమం, పొగాకు రైతుల పోరాటాలను ఆదర్శంగా తీసు కుని తమ హక్కుల కోసం పోరాడాలని కౌలు రైతులకు సూచించారు. భూ యజమానులు సహకరించి, కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు వచ్చేలా చూడాలని, దీనివల్ల భూ యజమానులకు ఎలాంటి నష్టం ఉండదని తెలిపారు. కౌలురైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్‌పై ప్రజా ఉద్యమం తప్పదు

హెచ్చరించిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి



మాట్లాడుతున్న మస్తాన్‌వలి

నరసరావుపేట: ఓటు చోరీకి సంబంధించి ఎన్నికల కమిషన్ హేతుబద్ధమైన స్పష్టమైన ఆధారాలు, సమాచారం ఇవ్వకుంటే ప్రజా ఉద్యమాలకు తెగబడతామని, దిక్కులు దిగ్బంధనం చేసి దేశాన్ని స్థంభింపజేస్తామని గుంటూరు మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి హెచ్చరించారు. రాహుల్ గాంధీ చేపట్టిన ఓటు చోరీ వ్యతిరేక ఉద్యమంపై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ మంగళవారం చేపట్టిన కాగడాల నిరసన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇది రాజ్యాంగం మీద జరిగిన దాడి అని అన్నారు. దేశానికి గుండెలాంటి రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత ప్రతిఒక్కరి మీదా ఉందన్నారు. జరిగే పరిణామాలకు బీజేపీనే బాధ్యత వహించాలని అన్నారు. బీజేపీ ప్రభుత్వంలో రైలు ప్రమాదాలు, బ్రిడ్జిలు కూలిపోవటం, అబద్ధ ప్రచారాలు చేయటం, నిరుద్యోగం, రైతులమీద నల్ల చట్టాలు చేయటం, ఆకలి చావులు, అత్యాచారాలు, హత్యలు, మతకలహాలతో ప్రజల జీవితాలు అస్తవ్యస్తమయ్యాయన్నారు. ఇలాగే కొనసాగితే దేశం ఎంతో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ పీసీసీ ఇంచార్జి మదన్ మోహన్‌రెడ్డి, చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల, సత్తెనపల్లి, అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జీలు మద్దూరి రాధాకృష్ణ, బోయపాటి రామాంజనేయులు, రామచంద్రారెడ్డి, చుక్కా చంద్రపాల్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంటా గోపి, పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎస్ఎం బాష, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు నాగూర్ పాల్గొన్నారు.

పేట టీపీఓపై చర్యలు తీసుకోవాలి

అమరావతి రజక ఐక్యవేదిక, ఎంహెచ్‌పీఎస్, బీఎస్‌పీ నాయకులు




మున్సిపల్ కార్యాలయంలో కూర్చుని నిరసన వ్యక్తంచేస్తున్న రజకులు, నాయకులు

నరసరావుపేట: రజకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మున్సిపల్ టీపీఓ సాంబయ్యపై చర్యలు తీసుకోవాలని అమరావతి రజక ఐక్యవేదిక, ఎంహెచ్‌పీఎస్, బీఎస్‌పీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి కమిషనర్ ఎం.జస్వంతరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌పీఎస్ నాయకుడు షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ కోటప్పకొండరోడ్డులో ఉన్న అన్నపూర్ణ రజక అన్నదాన సత్రం భూమిని కబ్జాకు గురైందని, కబ్జా చేసిన వ్యక్తుల నుంచి ఆ స్థలాన్ని కాపాడి సత్రంకు అందజేయాలని కోరుతూ రజకులు నాలుగు నెలల నుంచి మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఈ మేరకు టీపీఓను కలిసి అడగ్గా వారిపై అనుచితంగా మాట్లాడుతూ మీరు ఆఫీస్ నుంచి వెళ్ళిపోవాలి అంటూ దుర్భాషలాడుతూ ఘోరంగా మాట్లాడారన్నారు. బీఎస్‌పీ జిల్లా అధ్యక్షులు బూదాల బాబురావు, అమరావతి రజక ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు ఉదయగిరి వెంకటస్వామి, సత్యం కోటేశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

నేడు ఏడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

యడ్లపాడు: మండలంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చిలకలూరిపేట విద్యుత్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. లైన్ల మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటు కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. యడ్లపాడు, జాలాది, జగ్గాపురం, కారుచోల, ఉప్పరపాలెం, సంగంగోపాలపురం, మైదవోలు గ్రామాల్లో గృహ, వాణిజ్య విభాగాలకు విద్యుత్ ఉండదన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు అధికారులకు సహకరించాలని కోరారు.



ఫొటోగ్రాఫర్ సుబ్బారావుకు అవార్డు

వినుకొండ: 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా డాక్టర్ ఎస్.భగవాన్ దాస్, బండి రాజన్ బాబు మెమోరియల్ ఫొటోగ్రఫీ కాంపిటేషన్ 2025 ఫొటో జనిక్ ఆర్ట్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఫొటో కాంటెస్ట్‌లో వినుకొండ ఫొటోగ్రాఫర్ కేసనపల్లి సుబ్బారావు నలుపు తెలుపు విభాగంలో బుల్ కాంపిటేషన్ ఫొటోకి సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డు దక్కింది ఫొటో జనిక్ ఆర్ట్ సర్కిల్ సెక్రటరీ కానల సుధాకర్ రెడ్డి మెయిల్ ద్వారా తెలిపారని సుబ్బారావు వివరించారు. పట్టణంలోని ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ కార్యదర్శి రాయల శ్రీకాంత్, యార్లగడ్డ బుజ్జి, గోవడా శ్రీనివాసరావు, బ్రహ్మం, శ్యామ్, సీపీ, కన్నయ్య, బాజి తదితరులు కేసనపల్లి సుబ్బారావును అభినందించారు.